ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 31.0 | కనిష్ఠం : 22.0
ANDHRAJYOTHY
5
మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
మంగళవారం 14 అక్టోబరు 2025



ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

- హాస్టల్ బాత్‌రూమ్‌లో ఉరి వేసుకొని అఘాయిత్యం 6
- చదవలేకపోతున్నా.. మీ నమ్మకాన్ని నిలబెట్టుకోలేకపోతున్నానని నోట్
- ప్రేమ వేధింపుల కారణంగానే చనిపోయిందని తల్లి ఫిర్యాదు



ప్రియాంక (ఫైల్)

రాజకీయ చదరంగం

- జిల్లా క్లబ్ అధ్యక్ష పదవికి అధికార పార్టీ నాయకుల విఫలయత్నం
- అధ్యక్షుడిగా నాగేశ్వర్‌రెడ్డికే జై
- కార్యదర్శి పదవికి పోటాపోటీ
- నేడు ఉపసంహరణలు.. 26న పోలింగ్



జిల్లా క్లబ్ నూతన భవనం

మహబూబ్‌నగర్, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి) జిల్లా క్లబ్ అంటేనే మేధావులు కొలువుండే నిలయం. అక్కడ నెగ్గుకురావడం కత్తిమీద సామువంటిదే. హోదాతో పాటు పరపతి, రాజకీయ అండదండలు ఉండాలి. అయినా పోటీ కూడా ఎక్కువగానే ఉంది. 2,040 మందికి సభ్యత్వం ఉన్న జిల్లా క్లబ్‌కు ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్నాయి. క్లబ్ అంటేనే రాజకీయ చదరంగం. ఎవరికివాళ్లు రాజకీయ క్రీడకు తెరతీస్తుంటారు. ప్రస్తుతం నామినేషన్ల ఘట్టం, స్క్రూట్నీ పూర్తవగా నేడు ఉపసంహణలు ఉన్నాయి. ఈనెల 26న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కొద్దిరోజులుగా పాలమూరులో క్లబ్ రాజకీయమే హాట్‌టాపిక్‌గా మారింది.

అధ్యక్షపదవికి పోటీ

జిల్లా క్లబ్ అధ్యక్ష పదవి కోసం తెరవెనక పెద్ద రాజకీయమే జరిగింది. అధికార పార్టీ నుంచి ఎం సురేందర్‌రెడ్డి, జి రాజేందర్‌రెడ్డి పదవిని ఆశించారు. ఇద్దరూ నామినేషన్ వేసేకన్నా ముందుగానే సభ్యుల మద్దతు కూడగట్టారన్న ప్రచారం ఉంది. రాజేందర్ రెడ్డి అంతర్గతంగా సభ్యుల మద్దతు కూడగట్టేందుకు క్యాంపెయిన్ కూడా చేసుకున్నారు. కాగా ఇదివరకు క్లబ్ అంటే రాజకీయ జోక్యం మితిమీరి సభ్యులకు ఉనికి లేకుండా పోయిందన్న అభిప్రాయం మెజారిటీ సభ్యులలో నెలకొనడం వల్ల ప్రస్తుత ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఇందులో తాను జోక్యం చేసుకోనని ముందునుంచే చెబుతూ వస్తున్నారు. పోటీలో ఉన్న ఇద్దరూ అధికార పార్టీ నాయకులే కావడంతో అది రాజకీయ రంగు పులుముకునే అవకాశం ఉండటంతోపాటు బయట రకరకాల ప్రచారం జరుగుతోంది. దాంతో ఆయన పోటీలో ఉన్న ఇద్దరిని పిలిచి మాట్లాడారు. ఇద్దరూ సీనియర్ న్యాయవాది మనోహర్‌రెడ్డి వద్దకు వెళ్లాలని, ఆయన నిర్ణయం మేరకు నడుచుకోవాలని సూచించడంతో అంగీకరించిన ఇద్దరు జిల్లా క్లబ్‌లో నిర్వహించిన సభ్యుల సమావేశానికి హాజరయ్యారు. అక్కడ మనోహర్‌రెడ్డి ఇరువురికీ నచ్చజెప్పి, ప్రస్తుత పరిస్థితులలో జిల్లా క్లబ్‌ను నడిపించాలంటే అనుభవం అవసరం ఉందని చెప్పారు. అందుకు సీనియర్ సభ్యుడు, ఇదివరకు రెండు పర్యాయాలు కార్యదర్శిగా పనిచేసిన నాగేశ్వర్‌రెడ్డికి అవకాశం ఇద్దామని చెప్పడంతో అధ్యక్ష పదవి విషయంలో దాదాపుగా రూట్ క్లియర్ అయింది. అధ్యక్ష పదవి కోసం నాగేశ్వర్‌రెడ్డితోపాటు శివకుమార్ కూడా నామినేషన్ వేశారు. అతనితో విత్‌డ్రా చేయించి నాగేశ్వర్‌రెడ్డిని ఏకగ్రీవం చేసే అవకాశాలున్నాయి. కార్యదర్శి పోస్టుకోసం నలుగురు, కోశాధికారి కోసం మరో నలుగురు పోటీపడుతున్నారు. కార్యదర్శి కోసం ప్రస్తుత కార్యదర్శి మల్లు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు సంజీవ్ ముదిరాజ్‌తో పాటు మరో ఇద్దరు పోటీలో ఉన్నారు. అధ్యక్ష పదవి రెడ్డికి వెళితే కార్యదర్శి బీసీకి ఇవ్వాలన్న డిమాండ్ వినిపిస్తోంది. కాగా అధ్యక్ష పదవి కోసం సమావేశం నిర్వహించి, పేరును ప్రకటించిన పెద్దలు, మిగతా పోస్టుల విషయంలో కూడా అదేరకంగా ఏకగ్రీవం కోసం ప్రయత్నించి ఉంటే బాగుండేదన్న చర్చ సాగుతోంది.



పేకాట కోసం సభ్యుల పట్టు..

కాగా ఇంత పెద్ద భవనం నిర్మించుకున్నా పేకాట ఆడేందుకు అవకాశం లేకుండా పోయిందని, పేకాట ఆడేలా చూడాలని పలువురు సభ్యులు పట్టుబడుతున్నారు. క్లబ్ వ్యవహారం ఇప్పటికే బాగోలేదని, పేకాట నిర్వహిస్తే కొత్త సమస్యలు వస్తాయని పెద్దలు సభ్యులకు నచ్చజెప్పినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ప్రస్తుతం క్లబ్‌లో 2,040 మంది సభ్యులుగా ఉన్నారు. రూ.3 లక్షలు సభ్యత్వం ఫీజుగా ఉన్నది. ఇందులో దాదాపు 600 మంది వరకు హైదరాబాద్‌కు చెందిన సభ్యులు ఉన్నారు. హైదరాబాద్ ఫిలిం క్లబ్, బోట్ క్లబ్‌కు ఇక్కడ సభ్యత్వం ఉన్న వాళ్లకు అనుమతి ఉండటంతో అక్కడి నుంచి చాలామంది వచ్చి ఇక్కడ సభ్యత్వం పొందుతున్నారు.

బెదిరించి భూమి రిజిస్ట్రేషన్ 7

ప్రైవేటు ఏదీ?



జిల్లాలో అనుమతులు లేకుండా ప్రైవేటు పాఠశాలల నిర్వహణ

- ఒక స్కూల్‌కు అనుమతి తీసుకొని అదనంగా మరికొన్ని ఏర్పాటు
- వాటిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు చేసినా పట్టింపు కరువు
- మామూళ్ల మత్తులో విద్యాశాఖ!



మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రైవేట్ పాఠశాలలు కొనసాగుతున్నాయి. 2025-2026 విద్యా సంవత్సరానికి గాను జిల్లా పదుల సంఖ్యలో అనుమతి లేని పాఠశాలలను నిర్వహిస్తున్నారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారికి విద్యార్థి సంఘాలు, ప్రైవేట్ పాఠశాల యాజమాన్యలు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని మర్లు ప్రాంతంలో మూడు పాఠశాలలను అనుమతి లేకుండా నడుపుతున్నారు. మెట్టుగడ్డ ప్రాంతంలో ఒక పాఠశాల అనుమతితో మూడు బ్రాంచులు, శ్రీనివాస కాలనీ, పద్మావతి కాలనీలో కూడా ఒక పాఠశాలకు అనుమతి తీసుకుని రెండు పాఠశాలను నడుపుతున్నారు. గీత హోటల్ సమీపంలో ఓ పాఠశాలకు అనుమతి ఉండగా, మరో పాఠశాలను అదే పేరుమీద కొనసాగిస్తున్నారు. తనిఖీ చేసి, నిబంధలకు విరుద్ధంగా పాఠశాలలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నిస్తే ప్రజాప్రతినిధులతో ఫోన్ చేయిస్తున్నారని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. పలు పాఠశాలలకు అనుమతి లేకున్నా అధికార పార్టీకి చెందిన నాయకులతో ప్రారంభించడం గమనార్హం.

ఎన్ని ఫిర్యాదులు చేసినా..

ముడుపులు తీసుకుంటూ గత ఏడాది అప్పటి డీఈవో ఏసీబీకి పట్టుబడ్డ విషయం తెలిసిందే. ఇంత జరిగినా విద్యాశాఖలో మార్పు రావడం లేదు. మామూళ్లు ఇస్తుండటం వల్లే గుర్తింపు లేని పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. దాంతో ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పలు మార్లు విద్యాశాఖ అధికారికి, ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దాంతో అనుమతి ఉన్న జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించారు. గుర్తింపు లేని పాఠశాలలపై విచారించి, చర్యలు తీసుకోవాలని కోర్టు విద్యాశాఖ అధికారికి సూచించినా ఇప్పటికీ అటు వైపు చూడలేదన్న ఆరోపణలు ఉన్నాయి. చేయి తడిపితే విద్యాశాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడరని సంబంధిత ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సభ్యులు చెప్పడం గమనార్హం. ఉన్నతాధికారులు స్పందించి గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సం ఘాల నాయకులు, అనుమతి ఉన్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు కోరుతున్నారు.



కాసులిస్తే గప్‌చుప్!

యాజమాన్యాలు చేయి తడపడంతో అనుమతులు లేని పాఠశాలల వైపు విద్యాశాఖ అధికారులు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ జూనియర్ కళాశాలకు కూత వేటు దూరంలో రెండు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయి. ఒక పాఠశాలకు గుర్తింపు లేదు. ఆ పాఠశాల కింద సెల్లార్‌లో ఫంక్షన్ హాల్ నిర్వహిస్తున్నారు. ఇక్కడ నిత్యం ఏదో ఫంక్షన్ జరుగుతుంది. వంటలు చేస్తుంటారు. ఆ సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే విద్యార్థుల ప్రాణాలకు నష్టం వాటిల్లనుంది. దాని పక్కనే అనుమతి లేని మరో పాఠశాలను నిర్వహిస్తున్నారు. న్యూ ప్రేమ్‌నగర్‌లో కూడా నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలను నిర్వహిస్తున్నారు. మరో పాఠశాల యాజమాన్యం అయితే ఒక పాఠశాలకు అనుమతి తీసుకుని, మూడు చోట్ల స్కూల్స్ నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 60కిపైగా గుర్తింపు లేని పాఠశాలలు ఉన్నాయి.

పరీక్షలకు సన్నద్ధం

- ఈ నెల 24 నుంచి 31 వరకు ఎస్‌ఏ -1 పరీక్షలు
- ఒకటి నుంచి 9వ తరగతి వరకు..



నారాయణపేటలోని శివాజీ నగర్‌లో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల

నారాయణపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఎస్ఏ-1 (సమ్మెటివ్ అసెస్‌మెంట్) పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ సన్నద్ధమౌతోంది. ఈ నెల 24 నుంచి 31 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. డీఈఓ గోవిందరాజులు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. 6వ తరగతికి ఉదయం 9:15 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7వ తరగతికి మధ్యాహ్నం 1:15 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, 8వ తరగతికి ఉదయం 9:15 గంటల నుంచి మధ్యాహ్న 12 వరకు పరీక్షలు ఉంటాయి. 9వ తరగతికి మధ్యాహ్నం 1:15 గంటల నుంచి సాయంత్ర 4:15 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

హాజరుకానున్న 52,781 మంది విద్యార్థులు

జిల్లాలో 297 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 86 ప్రాథమికోన్నత పాఠశాలలు, 75 ఉన్నత పాఠశాలలు, 11 కస్తూర్బాలు, రెండు మాడల్ స్కూల్స్ ఉన్నాయి. వాటిలో 52,781 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. 1వ తరగతిలో 4,644 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 2వ తరగతిలో 4930 మంది విద్యార్థులు, 3లో 5036, 4లో 5143, 5లో 6,183, 6లో 5,683, 7లో 6,909, 8లో 7,013, 9లో 7,240 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు.



తరగతి గదిలో విద్యార్థులు

పనిచేసే వారికే గుర్తింపు

- ఏఐసీసీ పరిశీలకుడు, ఎమ్మెల్సీ నారాయణస్వామి
- డీసీసీ అధ్యక్ష పదవి కోసం ప్రజాభిప్రాయసేకరణ



మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు నారాయణస్వామి

నారాయణపేట/మరికల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పనిచేసే వారికే గుర్తింపు ఉంటుందని ఏఐసీసీ పరిశీలకులు, ఎమ్మెల్సీ నారాయణ స్వామి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ అన్నారు. సోమవారం నారాయణపేట సీవీఆర్ బంగ్లాలో డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక కోసం ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గాల వారీగా నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు సేకరిస్తున్నామని, ఆశవాహులు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఆరుగురి పేర్లను ఈ నెల 22న ఏఐసీసీకి నివేదిస్తామన్నారు. నియోజకవర్గంలోని దామరగిద్ద, నారాయణపేట మండలాల నాయకుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, వైస్ చైర్మన్ కోనంగేరి హన్మంతు పాల్గొన్నారు.

వారినే నియమించుకోవాలి

స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించే సామర్థ్యం గల నాయకులను డీసీసీ అధ్యక్షులుగా నియమించుకోవాల్సిన అవసరం ఉందని ఏఐసీసీ పరిశీలకుడు నారాయణస్వామి అన్నారు. మరికల్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో డీసీసీ అధ్యక్షుడు కె.ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ అధ్యక్షుడి ఎంపికపై సోమవారం అభిప్రాయ సేకరణ నిర్వహించారు. నారాయణస్వామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆసక్తి గల అభ్యర్థుల నుంచి ఈనెల 20 లోగా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్, ధన్వాడ సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, మండల అధ్యక్షుడు వీరన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

16న గవర్నర్ పర్యటన

- పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ ఈ నెల 16న జిల్లాకు రానున్నారని కలెక్టర్ విజయేందిరబోయి తెలిపారు. పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సోమవారం ఆమె ప్రజావాణి అనంతరం జిల్లా అధికారుల సమన్వయ సమావేశాన్ని నిర్వహించి, మాట్లాడారు. 16న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహన్నం 12:30 గంటల వరకు పాలమూరు యూనివర్సిటీ చాన్స్‌లర్‌గా స్నాతకోత్సవ కార్యక్రమానికి అధ్యత వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2:10 గంటల నుంచి 2:45 గంటల వరకు కలెక్టరేట్‌లో కలెక్టర్, టీబీ అధికారులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులతో సమావేశం అవుతారన్నారు. 2:45 గంటలకు రచయితలు, కళాకారులు, ప్రముఖులతో ముఖాముఖిలో పాల్గొంటారని తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రొటోకాల్ ప్రకారం ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లా, మండల ప్రత్యేక అధికారులు సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, కేజీబీవీలను ప్రతీ నెల తనిఖీలు చేయాలని ఆదేశించారు. తనిఖీ రిపోర్ట్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. మెనూ పాటించాలని, పాటించకుంటే తనిఖీలో గమనించి లోపాలపై షోకాజ్ నోటీస్‌లు జారీ చేయాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మధుసూదన్ నాయక్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు మొక్కను అందిస్తున్న ఎస్పీ

పేట కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

నారాయణపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట ఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డాక్టర్ వినీత్ సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధి, శాంతి భద్రతల పరిరక్షణకు సమన్వయంతో పని చేయాలని సూచించారు. శాఖపరమైన వివిధ అంశాలపై వారు చర్చించారు.

భార్య కాపురానికి రాలేదని..

- కలుపు మందు తాగి యువకుడి ఆత్మహత్య
- భూత్పూర్ మండలం మద్దిగట్లలో ఘటన



రాజు(ఫైల్)

భూత్పూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి); భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురై ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భూత్పూర్ మండలంలో మద్దిగట్లలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్దిగట్ల గ్రామానికి చెందిన సౌట రాజు(30)కు హైదరాబాద్‌లోని కిషన్‌నగర్ చెందిన మమతతో ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. కొద్ది రోజుల క్రితం భార్యా భర్తలు గొడవ పడ్డారు. మమత తల్లిగారి ఇంటికి వెళ్లింది. రెండు రోజుల క్రితం రాజు భార్యకు ఫోన్ చేసి, కాపురానికి రావాలని కోరాడు. అందుకు ఆమె తన అమ్మకు ఆరోగ్యం బాగోలేదని, కొన్ని రోజులు అయ్యాక వస్తానని చెప్పింది. దాంతో మనస్తాపానికి గురైన రాజు ఆదివారం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి ఎవరూ లేని సమయంలో కలుపు మందు తాగాడు. అస్వస్థతకు గురవడంతో తాను కలుపు మందు తాగానని అన్న వెంకటేష్‌కు ఫోన్ చేసి చెప్పాడు. రాజును చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందినట్లు మృతుని బంధువులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు భూత్పూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.



పాలమూరు యూనివర్సిటీ బాలికల హాస్టల్ భవనం

విద్యా కుసుమం.. జ్ఞాన పరిమళం

- అభివృద్ధి పథంలో పాలమూరు యూనివర్సిటీ
- అంచెలంచెలుగా ఎదుగుతున్న విశ్వ విద్యాలయం
- అందుబాటులోకి కొత్త కోర్సులు, భవనాలు

7



ఫామ్ లైవ్	: 110.00
హోల్ సేల్	: 116.00
డ్రెస్డ్	: 191.00
స్కిన్ లెస్	: 218.00

ఎత్తిపడేసిన ఎద్దు

- పొలంలోనే అన్నదాత మృతి
- కృష్ణ మండలం చేగుంట గ్రామంలో ఘటన 7

గో'మాతృ'హృదయం

- తల్లిలేని బుజ్జి మేకలకు తల్లిగా మారిన ఆవు
- ప్రతీ రోజు పాలిచ్చి ఆకలి తీరుస్తున్న గోవు



పేట మండలం మేకహనుమాన్ తండాలో మేకపిల్లలకు పాలు ఇస్తున్న గోవు

నారాయణపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : బుజ్జి మేక పిల్లలు నాలుగు.. వాటి తల్లి నెలక్రితం చనిపోయింది. ఆకలితో అల్లాడుతున్న ఆ పిల్లలకు గోమాత అమ్మగా మారింది. ప్రతీ రోజు పాలిచ్చి వాటి ఆకలి తీరుస్తోంది. జాతులు వేరైనా, ఏ జీవికైనా ఆకలి ఒక్కటేనని, అది తీర్చడమే అమ్మతనానికి అసలైన అర్థమని అందరికీ అర్థమయ్యేలా చాటి చెప్తోంది. అమ్మ ఎవరికైనా అమ్మే అన్నానుడికి అద్దం పట్టింది. నారాయణపేట మండలంలోని మేకహనుమాన్ తండాకు చెందిన రైతు శంకర్‌నాయక్‌కు ఆవులు, మేకలను పెంచుకుంటున్నాడు. నెల రోజుల క్రితం ఓ మేక చనిపోయింది. దానికి నాలుగు పిల్లలున్నాయి. వాటికి తల్లిలేని లోటును ఆవు తీరుస్తోంది. ప్రతీ రోజు పాలిస్తోంది.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ అఫిషియల్‌గా హైదర్‌పాషా



హైదర్‌బాషా

ఇటిక్యాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి అథ్లెటిక్ అఫిషియల్‌గా జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండల కేంద్రంలోని సాయుధ చైతన్య పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు హైదర్‌బాషా ఎంపికైనట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీసన్న, కార్యదర్శి సతీశ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అతడు ఇటీవల హన్మకొండలో నిర్వహించిన సెమినార్‌లో పాల్గొని ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు హన్మకొండలో నిర్వహించనున్న 23వ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆయన రెఫరీగా వ్యవహరిస్తారని తెలిపారు. అతడిని వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, సాయుధ చైతన్య పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

అథ్లెటిక్స్ పోటీల్లో స్వప్న ప్రతిభ



జాతీయ స్థాయి పతకాలు సాధించిన జిల్లా అథ్లెట్ కొడావత్ స్వప్న

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఒడిశా రాష్ట్రంలో సోమవారం ప్రారంభమైన 40వ నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా క్రీడాకారిణి కొడావత్ స్వప్న ప్రతిభ కనబరిచి పతకాలు సాధించింది. ఆమె సోమవారం జరిగిన 3000 మీటర్స్ స్టీపుల్ చేజ్ ఈవెంట్‌లో వెండి పతకం, 1500 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించింది. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ విజేందర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు, ఉపాధ్యక్షులు లావణ్యరెడ్డి, లక్ష్మి, భిక్షపతి, కోశాధికారి విజయ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు పరశురాం, అంజయ్య, కొర్ర రాములు, సభ్యులు శివకుమార్, శ్రీకాంత్, శేఖర్, హైమావతి, విష్ణు క్రీడాకారిణి స్వప్నను అభినందించారు.

వైభవంగా ఆరాధన మహోత్సవాలు



దేవేంద్రాచార్య మఠంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అమరచింత, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నాగల్‌కడుమూరు గ్రామంలో విశ్వ కర్మ జగద్గురు శ్రీ దేవేంద్రచార్య మహాస్వాముల మఠంలో 73వ ఆరాధన మహోత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా మఠంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వివిధ మఠాల నుంచి వచ్చిన పీఠాధిపతులు భక్తులకు ప్రవచనాలు వినిపించారు. ఆలయావరణంలో హోమం కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్నం ఆశ్రమం వద్ద అన్నదాన కార్యక్రమం, సాయంత్రం గ్రామంలో స్వామి వారి పల్లకీ సేవ వేద పండితుల మధ్య భాజాభజంత్రీలతో నిర్వహించారు. దేవేంద్ర ఆచార్యుల మఠాన్ని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అమ్మాపురం దొర సోంభోపాల్, జలంధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అయుబ్ ఖాన్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాఆర్యక్రమంలో మఠం నిర్వాహకులు నరసింహాచారి, నవీన్‌చారి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

'సీజేఐపై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి'

గద్వాల క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీ.ఆర్. గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్, ఎం.ఎస్.పీ, ఎం.ఎస్.ఎఫ్ అను బంధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి, జోగుళాంబ గద్వాల ఇన్‌చార్జి బుర్రి సతీష్‌మాదిగ మాట్లాడుతూ 2025, అక్టోబరు 7న భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయి బెంచ్ మీద లాయర్ల వాదనలు వింటున్న సమయంలో రాకేశ్ కిషోర్ అనే వ్యక్తి షూ విసరడం తగదన్నారు. దాడికి పాల్పడిన వారిని అధికారులు వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు ఉన్నత న్యాయస్థానాల్లో పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసు కోవాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ధర్నాకు ఎమ్మార్పీఎస్ దండోరా సీనియర్ నాయకులు గంజిపేట శంక ర్, కొంకల భీమన్న మాదిగ, సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో దండోరా భాస్కర్, బం డారి ఏసన్న, కోళ్ల మహేశ్ మాదిగ, సంధ్యపు ఏలియా, బి.కె. నర్సింహులు, ఎం.డి. ఆరీఫ్, సుభాన్, బాష, బీసమ్మ, మంజుల, శ్యాంసన్, తదితరులు అంజనేయులు ఉన్నారు.

మహిళల కోసం రాత్రి బడులు

- అక్షరాస్యత పెంపునకు అధికారుల చర్యలు
- సెర్ప్, మెప్మా సొసైటీల ద్వారా నిరక్షరాస్యుల గుర్తింపు



కోస్గి ఉమ్మడి మండలంలో మహిళా సంఘాల సభ్యులకు వయోజన విద్యపై అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్లు

కోస్గి రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మహిళా అక్షరాస్యతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లోని మహిళా సంఘాల సభ్యుల్లో నిరక్షరాస్యులైన వారందరికీ చదవడం, రాయడం నేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అండర్‌స్టాండింగ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ (ఉల్లాస్) కార్యక్రమంలో భాగంగా వారిని గుర్తించి పేర్లు నమోదు చేస్తున్నారు. వారందరికీ వారి నివాస ప్రాంతాల్లోనే రాత్రి బడులు ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టారు.

కొనసాగుతున్న పేర్ల నమోదు

విద్యపై అందరికీ అవగాహన, నిరంతర అధ్యయనమే లక్ష్యంగా 'ఉల్లాస్' కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించి పేర్లను నమోదు చేస్తున్నారు. నారాయణపేట జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు నారాయణపేట, మక్తల్, కోస్గి, మద్దూరులలో మెప్మా (మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మునిసిపాలిటీ ఏరియాస్) ద్వారా 35,930 మంది, గ్రామాల్లో సెర్ప్ (సొసైటీ ఫర్ ఎలిమినేషన్ రూరల్ పావర్టీ) ద్వారా 79,112 మంది మహిళలకు ఉల్లాస్ కార్యక్రమం ద్వారా చదవడం, రాయడం నేర్పించనున్నారు. మొదటి విడతలో గ్రామాలు, పట్టణాల్లోని 35,930 మంది మహిళలను అక్షరాస్యులను చేయడమే లక్ష్యంగా నిర్దేశించారు. అందుకోసం ఇప్పటివరకు 35,390 మంది మహిళల పేర్లను నమోదు చేసుకున్నారు.

ఉన్నత విద్యాభ్యాసానికి 'టాస్'

స్వశక్తి సంఘాల్లోని మహిళల్లో చదువు మధ్యలో ఆపేసిన వారు ఉన్నత విద్యాభ్యాసం చేసేందుకు 'టాస్' (తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ) ద్వారా అధికారులు కృషి చేస్తున్నారు. దూరవిద్యలో పదవ తరగతి, ఇంటర్‌లలో ప్రవేశాలు తీసుకునేలా ప్రోత్సహిస్తున్నారు. అందుకోసం జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది మొత్తం 2241 మంది లక్ష్యంగా నిర్ణయించగా, 1,755 మంది ముందుకొచ్చారు. ఇందులో పదవ తరగతిలో 650, ఇంటర్‌లో 1,105 మంది మహిళలు ప్రవేశాలు తీసుకున్నారు. అందుకు మహిళా సంఘాల ఆర్పీలు, సీసీలు, సంఘాల సభ్యులు సహకరిస్తున్నారు.

మహిళా అక్షరాస్యతను పెంచడమే లక్ష్యం

కేంద్ర రాష్ట్ర పథకాలైన ఉల్లాస్, టాస్‌ల ద్వారా మహిళా అక్షరాస్యతను పెంచడమే లక్ష్యంగా కృషి చేస్తున్నారు. పట్టణాలు, గ్రామాల్లో నిరక్షరాస్యులైన మహిళల పేర్లను నమోదు చేశాం. అలాగే వారికి ఉన్నత విద్యాభ్యాసం కోసం ఫీజులు కట్టి, ప్రవేశాలు చేయించామని వివరించారు.

– గోవిందు, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ మేనేజర్ (డీపీఎం), నారాయణపేట జిల్లా

కొనసాగుతున్న జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లోని 12 యూనిట్ల ద్వారా నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి కొనసాగిస్తున్నట్లు ఎస్ఈ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగువ కేంద్రంలో సోమవారానికి గడచిన 24 గంటల్లో 4.879 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఇప్పటి వరకు మొత్తం 417.816 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యింది. దిగువ కేంద్రంలో 24 గంటల్లో 4.598 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేశారు. ఇప్పటివరకు 403.361 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యింది.



లోయర్ జూరాలలో జల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్న టర్బైన్లు

ఒక విజన్‌తో జడ్చర్ల అభివృద్ధి

- వరద నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం
- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



వరద నీటి కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల నియోజకవర్గంతో పాటు మునిసిపాలిటీ అభివృద్ధికి ఒక విజన్‌తో ముందుకెళ్తున్నట్లు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. మునిసిపాలిటీలో వరద నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం కోసం రూ.17 కోట్ల నిధులు తీసుకొచ్చినట్లు తెలిపారు. మునిసిపాలిటీలో రూ.17 కోట్లతో నిర్మించే డ్రైనేజీ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేసి, నిర్మాణ పనులు చేపట్టే తీరును పవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో వివరించారు. మునిసిపాలిటీ అభివృద్ధికి రూ.12.50 కోట్లు మంజూరయ్యాయని, ఈ నిధులతో పాతబజారు అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. వరద నీటి కష్టాలు తొలగేందుకు ప్రత్యేక డిజైన్‌లతో డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జడ్చర్ల మునిసిపాలిటీ అభివృద్ధి పనులకు రూ.70 కోట్ల ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించడం జరిగిందని, ప్రస్తుతం పరిశీలనలో ఉందన్నారు. మునిసిపాలిటీలో గత ప్రభుత్వ హయాంలో 16 వెంచర్‌లలో లే అవుట్‌లు చేశారని, ఆ వెంచర్‌లలో మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు కల్పించకుండానే ప్లాట్ల విక్రయాలు చేశారని ఆరోపించారు. ఆ వెంచర్‌లకు నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. ఇలాంటి రియల్టర్లను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. న్యూజీలాండ్‌కు చెందిన సంస్థ డైరీ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చిందని, అందుకు 100 ఎకరాల స్థలం అవసరముందన్నారు. జడ్చర్ల మండలం వల్లూరు, బాలానగర్, మిడ్జిల్‌లో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. తెలంగాణ సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాదిమి శివకుమార్, మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, వైస్‌చైర్‌పర్సన్ సారిక, బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జ్యోతి, మునిసిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, డీఈ విజయభాస్కర్, ఏఈ గాయత్రి, కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, చైతన్యచౌహాన్, రమేశ్, ఉమాదేవి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా వాలీబాల్ జట్ల ఎంపిక



బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్‌లో విజేతలకు బహుమతులను అందచేస్తున్న శతాబ్ది ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు బాదిమి రవిశంకర్

జడ్చర్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లా అండర్-17 బాల, బాలికల జట్లను సోమవారం ఎంపిక చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మునిసిపాలిటీలోని బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఉమ్మడి జిల్లాల నుంచి పాల్గొన్న విద్యార్థుల్లో ప్రతిభ కనబరిచిన వారిని జట్లకు ఎంపిక చేశారు. ఎంపికైన బాలుర జట్టు సంగారెడ్డిలో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొననున్నది.

బాలికల జట్టు రాజాపూర్ మండలంలోని తిర్మలాపూర్‌లో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నది.

కార్యక్రమంలో బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్ శతాబ్ది ఉత్సవాల అధ్యక్షుడు బాద్మి రవిశంకర్, పీఈటీ అండ్ పీడీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దూమర్ల నిరంజన్, జగన్మోహన్‌గౌడ్, ఎస్జీఎఫ్ జిల్లా కన్వీనర్ శారదాబాయి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

- పరుషవేదీశ్వర ఆలయంలో నిర్వహణ



జడ్చర్ల మండలంలోని శ్రీ పరషవేదీశ్వరస్వామి దేవాలయం వద్ద నిర్వహించిన అగ్నిగుండంలో నడుస్తున్న భక్తుడు

జడ్చర్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలంలోని కుర్వగడ్డపల్లి సమీపంలోని పరుషవేదీశ్వరాలయంలో సోమవారం తెల్లవారుజామున అగ్ని గుండం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలువురు భక్తులు సమీపంలోని దుందుబీ నదిలో పుణ్యస్నానాలు చేసి అగ్నిగుండంలోని నిప్పుల మీద నడిచారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శివ పార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

సాయంత్రం స్వామి వారి పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గోపాల్, కైలాస్‌రూవార్, యాదయ్య, మల్లేశ్, శివ, శ్రీనివాసులు, రమాదేవి, విజయమ్మ, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

- హాస్టల్ బాత్‌రూమ్‌లో ఉరి వేసుకొని అఘాయిత్యం
- చదవలేకపోతున్నా.. మీ నమ్మకాన్ని నిలబెట్టుకోలేకపోతున్నానని నోట్
- ప్రేమ వేదింపుల కారణంగానే చనిపోయిందని తల్లి ఫిర్యాదు



ఆసుపత్రిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ విద్యార్థిని ఉరి వేసుకొని బలవన్మరణం చెందింది. తను చదువుకునే హాస్టల్‌లోని బాత్‌రూమ్‌లో చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలోని రామిరెడ్డిగూడలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో చోటుచేసుకున్నది. గద్వాల జిల్లా మల్దకల్‌కు చెందిన ప్రియాంక (18) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. సోమవారం ఉదయం 7:10 గంటల సమయంలో గురుకుల కళాశాల హాస్టల్ బాత్‌రూమ్ కిటికీకి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. గమనించిన హాస్టల్ నిర్వాహకులు విషయం పోలీసులకు తెలుపడంతో మృతదేహాన్ని జనరల్ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి గదిలో పోలీసులు సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు.

తాను చదువలేకపోతున్నానని జీవితంలో ఎంత కష్టమైనా పడతాను కానీ చదవలేకపోతున్నానని నోట్‌లో పేర్కొన్నది. " అమా... సారీ మీ నమ్మకాన్ని నిలబెట్టుకోలేకపోతున్నాను.. నా జాతకమే బాగలేదు. నేనంటే ఎవరికీ ఇష్టంలేదు. ఇక ఏ విషయంలోనూ నేను మీకు అడ్డురాను... నాకు బతకాలని లేదు." అని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నది.

విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. హాస్టల్‌కు వెళ్ళి అక్కడి పరిస్థితులు, విద్యార్థులతో మాట్లాడారు. తమ కూతురిని ప్రేమించమని గ్రామానికి చెందిన ఖాదర్ వెంటపడుతు న్నాడని, ప్రేమించాలని లేఖ కూడా రాశాడని, ఈ కారణంగా ఆత్మహత్య చేసుకొని ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తూ మృతురాలి తల్లి పద్మమ్మ రూరల్ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

అంతకుముందు జనరల్ ఆసుపత్రికి వెళ్ళిన జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి విద్యార్థిని భౌతికకాయాన్ని సందర్శించారు. విద్యార్థిని తండ్రి నాగయ్యను పరామర్శించారు. జరిగిన ఘటనపై విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు.

19న స్పీడ్ సైక్లింగ్ పోటీలు

మక్తల్, అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న ఉమ్మడి జిల్లా స్థాయి రోడ్ స్పీడ్ సైక్లింగ్ పోటీలను నిర్వహించనున్నట్లు సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోపాలం, ప్రధాన కార్యదర్శి థాన్‌సింగ్ తెలిపారు. నారాయణపేట జిల్లా, మక్తల్ పట్టణంలోని మినీ స్టేడియంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. 14, 16 18 ఏళ్లలోపు బాల బాలికలకు 5, 10 కలోమీటర్లు, 18 ఏళ్లు పైబడిన మహిళలు, పురుషులకు 10, 20 కిలోమీటర్ల సైక్లింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారిని 31 నుంచి నవంబర్ 2 వరకు రంగారెడ్డి జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు తమను సంప్రదించాలని కోరారు. సమావేశంలో సైక్లింగ్ అసోసియేషన్ కోశాధికారి బి. రూప పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

- యువకుడిపై పోక్సో కేసు

చిన్నచింతకుంట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ పేరుతో ఓ బాలికను అపహరించి, లైంగికదాడి చేసిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు భూత్పూర్ సీఐ రామకృష్ణ తెలిపారు. సూర్యాపేట జిల్లా, మత్తంపల్లి బోజతండాకు చెందిన చందర్‌నాయక్ అనే యువకుడు మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో నమ్మించాడు. అపహరించి, లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాలిక కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి రిమాండ్

తెలకపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండల కేంద్రంలో జరిగిన చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి, సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 7న మండల కేంద్రంలోని కోహినూర్ ఫంక్షన్ హాల్‌లో 15 క్వింటాళ్ల ఇనుము చోరీకి గురయ్యింది. పోలీసులు సోమవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా నిందితుడు పట్టుబడ్డాడు. అతడు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన ఆనంద్‌గా గుర్తించారు. అతడిని అరెస్టు చేసి, రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



విద్యుత్ స్తంభానికి ఢీకొట్టి బోల్తా పడ్డ కారు

కొత్తపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు పక్కన ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని, ఆ తర్వాత విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కారు బోల్తాపడింది. నారాయణపేట జిల్లా, కొత్తపల్లి మండల శివారులో సోమవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. కొత్తపల్లి నుంచి గుండుమాల్ వైపు వెళ్తున్న కారు, గ్రామ శివారులో రోడ్డు పక్కన నిలిపి ఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నది. అదే వేగంతో వెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్తంభం విరిగిపోవడంతో, నిలిచి పోయిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు ఏఈ బాల్‌రాజ్ తెలిపారు.

క్షుద్ర పూజల కలకలం

మక్తల్‌రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని మాద్వార్ గ్రామంలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. గ్రామ శివారులోని గుట్టకు వెళ్లే రోడ్డులో మూడు దారులు కలిసే చోట ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మేకను బలి ఇచ్చారు. పసుపు, కుంకుమ చల్లి క్షుద్ర పూజలు నిర్వహించారు. ఆ ప్రాంతంలో పురాతన ఆలయాలు ఉండటంతో గుప్త నిధుల కోసం క్షుద్ర పూజలు చేసి ఉంటారని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేశారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం

- నాగర్‌కర్నూల్‌లో వివాహిత, కొట్రలో వృద్ధుడు

నాగర్‌కర్నూల్ క్రైం/ వెల్దండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాల్లో వేర్వేరు చోట్ల ఓ వివాహిత, ఓ వృద్ధుడు అదృశ్యమ య్యారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన తుపాకుల స్వాతి (28), నరేశ్‌లకు తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ నెల 7న దంపతుల మధ్య గొడవ జరిగింది.

ఆ తర్వాత స్వాతి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో నరేశ్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నామోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

● వెల్దండ మండలంలోని కొట్ర గ్రామానికి చెందిన పొనుగోటి అర్జున్‌రావు అనే వృద్ధుడు ఆదివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో అతడి సోదరుడు కృష్ణారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్రైం కార్నర్

దూసుకొచ్చిన మృత్యువు

» గుర్తుతెలియని వాహనం ఢీకొని దుర్మరణం

మానవపాడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కారులో వెళ్తుండగా టైర్ పంక్చర్ అయ్యింది. యజమాని అర్ధరాత్రి వేళ రోడ్డు పక్కన నిలబడి సాయం కోసం ఎదురు చూస్తుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. మానవపాడు ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన కృష్ణయ్యగౌడ్ (50) ఆదివారం కారులో కర్నూలుకు బయలు దేరాడు. అర్ధరాత్రి దాటాక జల్లాపురం చెక్ పోస్టు వద్ద కారు టైర్ పంక్చర్ అయ్యింది. మరో వాహనం కోసం రోడ్డు పక్కన వేచి ఉండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడే ఉన్న ఆర్టీఏ సిబ్బంది గమనించి కర్నూల్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎత్తి పడేసిన ఎద్దు

» పొలంలోనే అన్నదాత కన్నుమూత


పూజారి మహాదేవప్ప (ఫైల్)

కృష్ణ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రాణపదంగా పెంచి పోషిస్తున్న ఎద్దు రైతును కుమ్మి ఎత్తిపడేయడంతో పొలంలోనే కన్ను మూశాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని చేగుంట గ్రామంలో సోమవారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రైతు పూజారి మహాదేవప్ప తన ఎద్దులను మేతకోసం పొలానికి తీసుకెళ్లాడు. వాటిలోని ఓ ఎద్దు మహాదేవప్పను కుమ్మి ఎత్తిపడేసి, కాలి గిట్టలతో వెన్నుపై తొక్కింది. అక్కడే పొలం పనులు చేస్తున్న కూలీలు గమనించి అక్కడికి చేరుకొనేలోపే అతడు మృతి చెందాడు. పూజారి మహాదేవప్పకు భార్య బసమ్మ, ఆరుగురు సంతానం ఉన్నారు.

మిద్దెమీది నుంచి కింద పడి తీవ్ర గాయాలు

» చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


ఇస్లావత్ ధన్‌కోటి (ఫైల్‌ఫోటో)

చారకొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మిద్దె మీద నుంచి జారి కింద పడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలంలో సోమవారం ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సారబండతండాకు చెందిన ఇస్లావత్ ధన్‌కోటి (44) ఈ నెల 1వ తేదీన మిద్దె మీద నుంచి దిగుతుండగా ప్రమాదవశత్తు కాలు జారి కింద పడడంతో తలకు తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు అతడిని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అతడికి భార్య బుజ్జి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సంఘటనపై కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎదురెదురుగా వస్తూ.. రెండు బైకులు ఢీ

» ఒకరి పరిస్థితి విషమం, మరొకరికి స్వల్ప గాయాలు

గద్వాల క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయిజ మండలంలోని పులికల్ గ్రామానికి చెందిన శ్రీనివాసులు ద్విచక్ర వాహనంపై గదాలకు వస్తున్నాడు. అదే సమయంలో విజయుడు అనే వ్యక్తి గద్వాల నుంచి అయిజ వైపు వెళ్తున్నాడు. జిల్లాకేంద్రంలోని తెలంగాణ చౌరస్తా సమీపంలో రెం డు వాహనాలు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. ప్రమాదంలో శ్రీనివాసులకు తీవ్రగాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన విజయుడు ఆ సమయంలో మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

కృష్ణానది ఒడ్డున యువతి మృతదేహం

» సగం కాలిపోయిన స్థితిలో లభ్యం


మంచాలకట్ట వద్ద, కృష్ణానది ఒడ్డున యువతి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ రామన్‌గౌడ్

పెంట్లవెల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదీ తీరంలో ఓ యువతి మృతదేహం లభ్యమైంది. అది సగం కాలిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉండటం కలకలం సృష్టించింది. నాగర్‌కర్నూల్ జిల్లా, పెంట్లవెల్లి మండలంలోని మంచాలక ట్ట వద్ద కృష్ణానది తీరంలో ఈ సంఘటన చోటు చేసుకున్నది. ఎస్‌ఐ రామన్ గౌడ్ తెలిపిన వివరాలు.. నదీ తీరంలోని చింతరాయ గుట్ట వద్ద గొర్రెల కాపరులకు ఓ గుర్తు తెలియని యువతి మృతదేహం సగం కాలిపోయి గుర్తుపట్టలేని స్థితిలో కనిపించింది. దీంతో వారు మంచాలకట్ట గ్రామస్థులకు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దాదాపు 5 రోజుల క్రితమే ఈ సంఘటన జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కంకర పరిశ్రమలో కార్మికుడికి తీవ్ర గాయాలు

» ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి

బాలానగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కంకర పరిశ్రమలో ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్ మండల పరిధిలోని పెద్ద రేవెల్లి శివారులో గల కార్తికేయ కంకర పరిశ్రమలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన రాముదాస్ కశ్యప్ అనే కార్మికుడు పని చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం అతడు తీవ్రంగా గాయపడి తోటి కార్మికులకు కనిపించాడు. వారు అతడిని 108 అంబులెన్సులో జడ్చర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. సంఘటనపై అతడి బంధువు దుర్గారామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లెనిన్ వెల్లడించారు.

మహిళతో మాటలు కలిపి
పుస్తెల తాడు చోరీ

తిమ్మాజిపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఓ మహిళతో ఓ వ్యక్తి మాటలు కలిపారు. ఫలానా ఊరికి దారి ఎటు అని అడుగుతూ ఆమె మెడలోనుంచి పుస్తెల తాడును లాక్కొని పరారయ్యాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా, తిమ్మాజిపేట మండలంలోని మారేపల్లిలో జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం... మంగలి మనమ్మ అనే మహిళ తన మనవరాలితో కలిసి వెళ్తుండగా, ఓ వ్యక్తి ఆమెతో మాటలు కలిపాడు. పలానా ఊరికి ఎలా వెళ్లాలని అడుగుతూ ఆమె మెడలో నుంచి పుస్తెలతాడు తెంచుకుని పరిగెత్తి, అప్పటికే స్టార్ట్ చేసి సిద్ధంగా ఉంచుకున్న బైక్‌పై ఎక్కి పరారయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి, సీఐ అశోక్‌రెడ్డి గ్రామానికి వెళ్లి సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు.

బాధిత మహిళతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విద్యా కుసుమం జ్ఞాన పరిమళం

- » అభివృద్ధి పథంలో పాలమూరు యూనివర్సిటీ
- » అంచెలంచెలుగా ఎదుగుతున్న విశ్వ విద్యాలయం
- » విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే లక్ష్యం
- » అందుబాటులోకి కొత్త కోర్సులు, అధునాతన భవనాలు


యూనివర్సిటీ ప్రధాన భవనం



స్నాతకోత్సవానికి వేదిక కానున్న లైబ్రరీ భవనం

పాలమూరు యూనివర్సిటీ , అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లాలో వెలసిన పాలమూరు యూనివర్సిటీ విద్యా కుసుమంగా జ్ఞాన పరిమళాలను వెదజల్లుతోంది. ఒకే ఒక్క భవనంలో, ఐదు కోర్సులతో ప్రారంభమైన వర్సిటీలో ప్రస్తుతం 21 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. 2008 కి ముందు ఇక్కడ ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధంగా పీజీ కేంద్రం కొనసాగుతుండేది. తెలంగాణ ఉద్యమం బలపడుతున్న సమయంలో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అదే సంవత్సరం నవంబర్ 8న పాలమూరు యూనివర్సిటీకి అప్పటి ఎంపీ విఠల్‌రావుతో కలిసి శంకుస్థాపన చేశారు. మొట్టమొదటి వైస్ చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ వి.గోపాల్‌రెడ్డి నియమితులయ్యారు. అప్పుడు 151 ఎకరాల్లో పచ్చని ప్రకృతి మధ్య ప్రారంభమైన యూనివర్సిటీ అంచెలంచెలుగా ఎదుగుతూ అభివృద్ధి పథంలో నడుస్తోంది. ప్రస్తుతం 171 ఎకరాల్లో, అధునాతన భవనాలలో కొనసాగుతోంది. మూడు అనుబంధ పీజీ కేంద్రాల్లో లా, ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంఈబీ కళాశాలలతో పాటు, 21 కోర్సులు, 6 విభాగాలలో పీహెచ్‌డీ, 158 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలతో దినదినాభివృద్ధి చెందుతోంది.

విశ్వ విద్యాలయ విశిష్టతలు

అధ్యాపకుల కృషి, విద్యార్థుల ప్రతిభతో పాలమూరు యూనివర్సిటీ విశిష్టతను చాటుతోంది. వివిధ అంశాల్లో గిన్నిస్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు దక్కించుకున్నది. న్యాక్ బీ గ్రేడ్, యూజీసీ 12బీ గ్రేడ్‌తో పాటు, ఎన్‌సీటీఈ, పీసీఐ గుర్తింపులను పొందింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పీయూ అధ్యాపకులు ప్రొఫెసర్ పిండి పవన్ కుమార్, డాక్టర్ చంద్ర కిరణ్, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ కిశోర్, డాక్టర్ నూర్జహన్ బేగంలతో పాటు పలువురు పరిశోధనలు చేసి పేటెంట్లు పొందారు. వర్సిటీ అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ఎంఓయూలను కుదుర్చుకొని విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. ఇప్పటికే మూడు స్నాతకోత్సవాలను పూర్తి చేసుకున్న యూనివర్సిటీలో ఈ విద్యాసంవత్సరం లా, ఇంజనీరింగ్ కాలేజీలు ప్రారంభమయ్యాయి. వచ్చే ఏడాది జర్నలిజం ప్రత్యేక స్కిల్స్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు యూజీసీకి ప్రతిపాదనలు పంపించారు. 3వ స్నాతకోత్సవానికి అప్పటి గవర్నర్ డాక్టర్ సౌందరరాజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ నెల 16న జరిగే స్నాతకోత్సవానికి ప్రస్తుత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రానున్నారు.

ప్రతీ ఏడాది 70 వేల మందికి ఉన్నత విద్య

పాలమూరు యూనివర్సిటీ ప్రతీ సంవత్సరం 70 మంది విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తోంది. ఇందులో 18 పీజీ, 32 బీఈడీ, 90 డిగ్రీ, 3 ఎంఈడీ, 3 బీఈడీ, ఆరు ఎంబీఏ, ఒక ఎంసీఏ, 3 ఫార్మసీ, 2 లా, ఒక ఇంజనీరింగ్ కళాశాలలున్నాయి.

అలాగే 33 ప్రభుత్వ, 102 ప్రైవేట్ 3 టీజీడబ్ల్యుఆర్‌డీసీ, మరో మూడు టీటీడబ్ల్యూఆర్ డీసీ, నాలుగు ఎంజీబీఆర్ కళాశాలలు యూనివర్సిటీకి అనుబంధంగా కొనసాగుతున్నాయి.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

పీజీ కేంద్రం కోసం రూ.1.76 కోట్ల వ్యయంతో నిర్మించిన భవనంలోనే యూనివర్సిటీ ప్రారంభమైంది. ముఖ్యమంత్రి రోశయ్య హయాంలో రూ.10కోట్లు మంజూరు చేయగా, రూ. 4 కోట్లతో సైన్స్ బిల్డింగ్, ఆర్ట్స్ కాలేజీ భవనాలను నిర్మించారు. ప్రస్తుతం బాలురకు మూడు, బాలికలకు రెండు వసతి గృహాలున్నాయి. అకాడమిక్ బ్లాక్, ఫార్మసీ కాలేజీ, పరీక్షల నిర్వహణ, పరిపాలన, గ్రంధాలయం, స్పోర్ట్స్, హెల్త్ భవనాలతో పాటు గెస్ట్ హౌస్, వీసీ రెసిడెన్సీలున్నాయి. క్రీడాకారులకు అవసరమైన సింథటిక్ ట్రాక్, ఇతర వసతులు కూడా అందుబాటులోకి వచ్చాయి. యూనివర్సిటీ అనుబంధంగా వనపర్తి, గద్వాల, కొల్లాపూర్‌లలోని పీజీ కేంద్రాల్లో తరగతి గదులు, బాలికలు, బాలురకు ప్రత్యేక భవనాలను నిర్మించారు. ప్రస్తుతం పరిశోధనా కేంద్రం, అకాడమిక్ భవనంలో అదనపు తరగతులు, సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

ముస్తాబవుతున్న యూనివర్సిటీ


పీయూలోని రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలగిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు


స్నాతకోత్సవం నిర్వహించే లైబ్రరీకి భవనంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయలకు సంబంధించిన చిత్రాలను వేయిస్తున్న సిబ్బంది

పాలమూరు యూనివర్సిటీ , అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలో ఈ నెల 16న నిర్వహించనున్న నాల్గవ స్నాతకోత్సవానికి ముస్తాబవుతోంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో పాటు, పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా పీయూ పరిధిలోని అన్ని విభాగాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల విద్యార్థులు ప్రత్యేక క్యాంపులుగా ఏర్పడి పండుగ వాతావరణంలో పనులు చేస్తున్నారు. స్నాతకోత్సవం నిర్వహణకు 7 కమిటీలను ఏర్పాటు చేశారు. వారి ఆధ్వర్యంలో పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. వేడుక నిర్వహించనున్న లైబ్రరీ ఆడిటోరియాన్ని సిద్ధం చేస్తున్నారు. అందులో 240 సీట్లు మాత్రమే ఉండటంతో, ఉత్సవాలను ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అకాడమిక్, ఫార్మసీ భవనాల్లోని సెమినార్ హాళ్లలో భారీ డిజిటల్ తెరలను సిద్ధం చేస్తున్నారు. స్నాతకోత్సవానికి మరో రెండు రోజుల సమయం మాత్రమే ఉండటంతో అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు రాత్రి, పగలు పనిలోనే నిమగ్నమై ఉన్నారు.

స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి

» పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్



స్నాతకోత్సవ సమీక్ష సమవేశంలో కమిటీ సభ్యులకు సూచనలు చేస్తున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్.

పాలమూరు యూనివర్సిటీ , అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని చేయాలని వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. యూనివర్సిటీ పరిపాలనా భవనంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో, స్నాతకోత్సవ ప్రత్యేక కమిటీ సభ్యులతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16న నిర్వహించనున్న స్నాతకోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. అందుకోసం పక్కాగా ఏర్పాట్లు చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. లోటు పాట్లు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.

జిల్లాకు 10 మంది టూరిస్టు పోలీసులు

» నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్


జిల్లాకు కేటాయించిన టూరిస్టు పోలీసులతో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం/ కొల్లాపూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాకు 10 మంది టూరిస్టు పోలీసులను ప్రభుత్వం కేటాయించినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. జిల్లాలోని ప్రధాన పుణ్యక్షేత్రాల్లో ప్రతీ సంవత్సరం నిర్వహించే జాతరలు, ఉత్సవాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా వారు పర్యవేక్షించనున్నారు. అలాగే పర్యాటక కేంద్రాల వద్ద సందర్శకులకు అవసరమైన భద్రత కల్పించనున్నారు. జిల్లాకు కేటాయించిన టూరిస్టు పోలీసులు సోమవారం కొల్లాపూర్ పట్టణంలోని మంత్రి జూపల్లి కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో, పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహకు రిపోర్టు చేశారు.

బెదిరించి భూమి రిజిస్ట్రేషన్

» పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

» ఏడుగురిపై కేసు నమోదు

మహబూబ్‌నగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : తమను భయభ్రాంతులకు గురిచేసి భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహబూబ్‌నగర్ రూరల్ పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. బాధితురాలు, హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన పాలాది కళావతి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కళావతి, ఆమె కుమారులకు, రాఘవేందర్‌రాజు, అతడి అనుచరులకు మధ్య భూ వివాదం చాలా కాలంగా కొనసాగుతోంది. ఇదే అంశంపై ఉన్న కేసు విషయంలో ఆగస్టు 4న వారు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండగా, అప్పన్నపల్లి సమీపంలోని మయూరీ పార్కు సమీపంలో రాఘవేందర్‌రాజు, అతడి అనుచరులు వారిని కిడ్నాప్ చేసి బెదిరించారు. పాలకొండ పరిధిలోని 3 ఎకరాలకు పైగా ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. సంఘటనపై బాధితులు ఆదివారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాఘవేందర్‌రాజు, శివశంకర్‌గౌడ్, పవన్‌కుమార్ గౌడ్, విజయ్‌కుమార్, గోక నరేందర్, సురేశ్, శివలింగంలపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

పులుల సంరక్షణకు పరస్పర సహకారం

» నల్లమల అభయారణ్యంలో సంయుక్త గస్తీ

» ఏపీ, తెలంగాణ అటవీ శాఖ అధికారుల నిర్ణయం

బ్రహ్మగిరి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : అడవి అభివృద్ధి, పులులు, వన్యప్రాణుల సంరక్షణకు పరస్పర సహకారం అందించుకోవాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అటవీశాఖ అధికారులు నిర్ణయించారు. నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలంలోని బ్రహ్మగిరి వనమయూరీ అతిథి గృహంలో సోమవారం అమ్రాబాద్, నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వు ముఖ్య అధికారుల సమావేశం నిర్వహించారు. అటవీశాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి, ఏలూసింగ్ మేరు అధ్యక్షతన కొనసాగిన ఈ సమావేశంలో అటవీ సంరక్షణకు అవసరమైన అంశాలపై చర్చించుకున్నారు. రెండు రాష్ట్రాల్లో పులుల సంరక్షణ, అడవుల అభివృద్ధికి సంయుక్త గస్తీ నిర్వహించాలని, అడవుల నరికివేత నివారణకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. పులుల డేటా భాగస్వామ్యం, పర్యవేక్షణ, సంరక్షణ, ఫొటోగ్రఫీ ఆధారంగా పులుల కదలికలను గుర్తించే యంత్రాల ఏర్పాటు తదితర నిర్ణయాలు తీసుకున్నారు. వణ్యప్రాణుల కారిడార్ నిర్వహణ, మనుషులు, జంతువుల మధ్య సంఘర్షణలు తగ్గించడంపై చర్చిం చారు. ఈ అంశాలపై రెండు రాష్ట్రాల అధికారులు అంగీకారం తెలి పారు. కార్యక్రమంలో డీఎఫ్‌వోలు, ఎఫ్‌డీవోలు, ఎఫ్‌ఆర్‌వోలు పాల్గొన్నారు.

నేడు వనపర్తికి రానున్న మాజీ ముఖ్యమంత్రి

వనపర్తి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నేడు (మంగళవారం) జిల్లా కేంద్రానికి పుదుచ్చే రి కేంద్ర పాలిత ప్రాంతం మాజీ ముఖ్యంత్రి నారాయణస్వామి రానున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడి ఎన్నిక కోసం నేడు జిల్లా కేంద్రానికి మాజీ ముఖ్యమంత్రి వస్తున్నారని, ఉదయం 11 గంటలకు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేక రుల సమావేశం ఉంటుందని, మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం ఉంటుందన్నారు. సమా వేశానికి మాజీ సీఎం నారాయణస్వామితో పాటు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, స్పోర్ట్స్ కార్పొరేషన్ చైర్మన్ శివసేనారె డ్డి, నేషనల్ ఏఐపీసీ కోఆర్డినేటర్ జిల్లెల ఆదిత్యారె డ్డి హాజరుకానున్నారని తెలిపారు.

యశోదమ్మ కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

» నాయనమ్మకు నివాళి అర్పించిన సినీ దర్శకుడు నాగ్ అశ్విన్


ఐతోల్‌లో ఇటీవల మృతి చెందిన యశోదమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

తాడూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూరు మండలంలోని ఐతోలు గ్రామంలో ప్రముఖ దర్శకుడు నాగ్ అశ్విన్ నాయనమ్మ యశోదమ్మ మృతి చెందిన విషయం విదితమే. కుటుంబ సభ్యులు సోమవారం సాయంత్రం నిర్వహించిన దశదినకర్మకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హాజరయ్యారు. యశోదమ్మ చిత్ర పటం వద్ద నివాళి అర్పించారు.

కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే నాయనమ్మ చిత్ర పటానికి మనుమడు నాగ్ అశ్విన్ పూలు వేసి నివాళి అర్పించారు. అలాగే నాగం శశిధర్‌రెడ్డి, ఎస్‌వీఎస్ హాస్పిటల్స్ అధినేత రాంరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు మణెమ్మ, మాజీ ఎంపీపీ గుర్రాల శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్..

నేడు జిల్లా చెస్, ఆర్చరీ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-14, 17, 19 చెస్, ఆర్చరీ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పదో తరగతి మెమో, బోనఫైడ్, ఆధార్, నాలుగు ఎలిజిబిలిటీ పత్రాలతో ఉదయం 9 గంటలకు కోచ్ జ్ఞానేశ్వర్‌కు రిపోర్టు చేయాలని కోరారు.

నేటి నుంచి జిల్లా కబడ్డీ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో జిల్లా కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం అండర్-14 బాల, బాలికల, బుధవారం అండర్-17 బాల, బాలికల జట్ల ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. బోనఫైడ్, ఆధార్, నాలుగు ఎలిజిబిలిటీ పత్రాలతో ఉదయం 9 గంటలకు పీడీ రాజవర్ధన్‌రెడ్డికి రిపోర్టు చేయాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన

కోయిలకొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో సోమవారం కోయిలకొండ పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, గంజాయి, జూదం, బాల్య వివాహాపై ప్రజలకు అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బంది శ్రీహరిగౌడ్, బాల్‌రాజు, సుజాత పాల్గొన్నారు.

మార్కెట్‌లో కొనసాగిన ధాన్యం కొనుగోలు

దేవరకద్ర, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కొనసాగుతోంది. సోమవారం వివిధ గ్రామాల నుంచి రైతులు 12 క్వింటాళ్ల పెద్ద హంస విక్రయానికి తీసుకరాగా, వేలంలో పెద్ద హంస గరిష్ఠంగా రూ.1802, కనిష్ఠంగా రూ.1800 పలికినట్లు మార్కెట్ అధికారి జయ్యశ్రీ తెలిపారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

మూసాపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండలం తిమ్మాయిపల్లితండాకు చెందిన మాజీ సర్పంచ్ హన్మంతునాయక్ తల్లి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్ సోదరుడు భాస్కర్‌రెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి పరామర్శించారు.

కాంగ్రెస్ నాయకులను పరామర్శించిన ఎమ్మెల్యే

జడ్చర్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూర్గుపల్లిలో బాదేపల్లి మార్కెట్ డైరెక్టర్ యాకోబును సోమవారం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల గుండెపోటుకు గురై చికిత్స పొందిన అనంతరం ఆయనను గ్రామంలోని యాకోబు గృహానికి వెళ్లి పరామర్శించారు. అదే విధంగా ఇటీవల ప్రమాదానికి గురైన బాదేపల్లి గ్రంధాలయ చైర్మన్ అయ్యన్నను పరామర్శించారు.

ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తివేయాలి

జడ్చర్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లల నిబంధనను ఎత్తివేయాలంటూ సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డికి వివిధ పార్టీల నాయకులు వినతిపత్రం అందజేశారు. ముగ్గురు పిల్లలు ఉన్న అభ్యర్థులకు ఎన్నికల్లో నిలబడే అర్హత లేదని, నిబంధనను ఎత్తివేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. నాయకులు జలేందర్, వెంకటరమణ ఉన్నారు.

ప్రజావాణికి ఒక్క ఫిర్యాదు

రాజాపూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణికి ఒక్క ఫిర్యాదు వచ్చినట్లు ఎంపీడీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. ప్రజలు ఏమైన సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని కోరారు.

వెన్నచేడులో లోపించిన పారిశుధ్యం



వెన్నచేడులోని ఎస్సీ కాలనీలో ఇళ్ల మధ్య కంపచెట్లు

గండీడ్ అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెన్నచేడు గ్రామంలో పారిశుధ్యం లోపించించి. పేరుకే ఈ గ్రామం మండలంలోనే అతిపెద్ద గ్రామ పంచాయతీ. కానీ కనీస సౌకర్యాలకు కూడా నోచుకోలేదు. చెత్త ఎక్కడికక్కడే పేరుకుపోవడంతో పాటు డ్రైనేజీలు లేక రోడ్లపైనే మురుగు పారుతోంది. పందులు సంచరించడంతో రోగాలు వ్యాప్తి చెందుతున్నాయి. కాలనీల్లో పాడుబడ్డ ఇళ్లలో మొలచిన కంపచెట్లను తొలగించే అధికారులే కరువయ్యారు. అధికారులు స్పందించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

» కలెక్టర్ విజయేందిర బోయి



కలెక్టర్ సమక్షంలో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆకస్మిక కార్డియాక్ గురైన వ్యక్తులకు సకాలంలో సీపీఆర్ చేసి ప్రాణాలు రక్షించవచ్చని, దీనిపై ప్రతీ ఒక్కరికి అవగహన అవసరమని కలెక్టర్ విజయేందిర బోయి పేర్కొన్నారు. సోమవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సీపీఆర్ (కార్డియో పల్మోనరీ రిససిటేషన్) అవగాహన కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. ప్రజా జీవితంలో అకస్మాత్తుగా కొందరికి కార్డియాక్ అరెస్ట్ వచ్చి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, అలాంటి వారు సీపీఆర్‌తో ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడుతున్నారన్నారు. ఈనెల 17 వరకు వారం రోజుల పాటు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెడికల్ ఆఫీసర్‌లు డాక్టర్ మనుప్రియ, డాక్టర్ శివకాంత్ సీపీఆర్‌పై వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మధుసూదన్ నాయక్, డీఎంహెచ్‌వో పద్మజ, డిప్యూటీ డీఎంహెచ్‌వో శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నేరం

గర్భస్థ శిశులింగ నిర్ధారణ పరీక్షలు నేరమని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ప్రవేటు ఆసుపత్రుల యాజమాన్యంతో గర్భస్థ శిశులింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులకు లింగ నిర్ధారణ చేస్తే మొదటి సారి రూ.10 వేల జరిమానాతో జైలు శిక్ష, రెండో సారి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధించనున్నట్లు తెలిపారు. అబార్షన్లకు సంబంధించిన వివరాలు విధిగా రికార్డులో నమోదు చేయాలని, సర్వీస్ చార్జీల బోర్డులు పెట్టాలన్నారు. ఐఎంఏ ప్రసిడెంట్ డాక్టర్ రామ్మోహన్, డాక్టర్ శ్యాములు, డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మజ, డీఈఎంవో నరేష్‌చంద్ర పాల్గొన్నారు.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి 78 ఫిర్యాదులు రాగా, కలెక్టర్ ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసం ఇచ్చిన ప్రతీ దరఖాస్తును నిర్లక్ష్యం చేయకుండా పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి, డీఆర్డీవో నర్సింహులు, ఆర్డీవో నవీన్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు, డ్రైనేజీలు నిర్మించాలి..

ఎదిర 4వ వార్డులో హనుమాన్ ఆలయం సమీపంలో గల కొత్తకాలనీలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మిషన్‌భగీరథ పైప్‌లైన్ వేయాలని కోరుతూ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సూరిబాబు, విఠల్, భాను, రమేష్, బాలకృష్ణమ్మ, లక్ష్మణ్, అమృత, రామకృష్ణ ఉన్నారు.

చినుకు పడితే చిత్తడే

» మోటార్‌లైన్ రోడ్లపై వర్షపు నీరు



మోటర్‌లైన్‌లో మట్టి రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మోటర్ లైన్‌లో చినుకు పడితే చిత్తడిగా మారి నడవలేకపోతున్నారు. మోటర్ లైన్‌లో సీసీ రోడ్లు లేకపోవటంతో మట్టిరోడ్డుపై పెద్ద మొత్తంలో వర్షపు నీరు చేరడంతో అడుగు తీసి అడుగు వేయాలంటే ఎక్కడ జారి పడతామోనని ప్రజలు భయపడుతున్నారు. వర్షపు నీరు నిల్వ ఉండడంతో పారిశుధ్యం అధ్వానంగా మారడంతో అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని వాపోతున్నారు. మోటర్ లైన్‌లో వివిధ వాహనాల మరమ్మతు చేసే దుకాణాలతో పాటు చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత సర్కార్ హయాంలో కొన్ని చోట్ల సీసీ రోడ్లు వేయగా, మరికొన్ని చోట్ల సీసీ రోడ్లు లేకపోవటంతో వాహన, దుకాణాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని మోటర్‌లైన్ వాసులు కోరుతున్నారు.

కేటగిరీ వారీగా ఓటరు లిస్టు సరిచేయాలి

మహమ్మదాబాద్, అక్టోబరు, 13 (ఆంధ్రజ్యోతి) : కేటగిరి వారీగా ఓటరు లిస్టును సరి చేయాలని తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోల సమావేశం నిర్వహించారు. డబుల్ ఓట్లు ఉంటే ఓ చోట తొలగించాలని, పర్మినెంట్, టెంపరరీ ఓటర్లను గుర్తించాలని చనిపోయిన, అలాగే పెళ్లి అయిన వారి ఓట్లు తొలగించాలన్నారు. డీటీ శేఖర్, ఆర్‌ఐ అహమ్మద్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులకు మరమ్మతు

» నీటి సరఫరా పునరుద్ధరణ



పైప్‌లైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

మహబూబ్‌నగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు నగరానికి తాగునీరు సరఫరా అయ్యే మిషన్‌భగీరథ పైపులు ధర్మాపూర్ రామిరెడ్డిగూడ వద్ద రెండు రోజుల క్రితం ధ్వంసమయ్యాయి. దీంతో నగరానికి నీటి సరఫరా నిలిచిపోయింది. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టగా, సోమవారం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మునిసిపల్ అధికారులు పనులు పర్యవేక్షించారు. సాయంత్రానికి నీటి సరఫరాను పునరుద్ధరించారు. కమిషనర్ మాట్లాడుతూ పైపుల లీకేజీ కారణంగా రెండు రోజులుగా నగరానికి నీటి సరఫరా నిలిచిపోయిందని, పనులు పూర్తి కావడంతో సాయంత్రం నుంచే నీటి సరఫరా ప్రారంభమవుతుందన్నారు.

సమస్యలపై టోల్‌ఫ్రీ నెంబర్..

నగరంలో తాగునీటి పైప్‌లైన్‌ల లీకేజీ, నీటి సరఫరాలో అంతరాయం, పబ్లిక్‌బోర్ రిపేరు, వీధి దీపాలు వెలగకపోవడం వంటి సమస్యలపై టోల్‌ఫ్రీ నెంబర్ 7093911352కు ఫోన్ చేయాలని కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదులు చేసుకోవచ్చని సూచించారు.

కౌన్సిలర్, మాజీ ఎంపీటీసీ మధ్య వాగ్వాదం

జడ్చర్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : వరద నీటి కాల్వల నిర్మాణ పనుల ప్రారంభం కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ కుమ్మరి రాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మమ్మ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పట్టణంలోని చంద్రాగార్డెన్స్‌కు వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇరువురు ఒకరిపై మరొకరు దూషించుకున్నారు. వార్డుకు సంబంధించిన నిధులు, అభివృద్ధి పనుల అంశంతో పాటు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంలో ఒకరికొకరు మధ్య జరిగిన సంభాషణ కాస్త వాగ్వివాదానికి దారి తీసింది.

కాటమయ్య విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలకు తరలిరావాలి

కోయిలకొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని దేవుని గుట్టలో ఈ నెల 24 నుంచి నిర్వహించనున్న శ్రీ కంఠ మహేశ్వర స్వామి కాటమయ్య ప్రతిష్ఠ మహోత్సవానికి గౌడ సంఘం నాయకులు తరలిరావాలని గౌడ ఉద్యోగుల సంఘం నాయకులు వెంకటస్వామి, రాజయ్య కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ఆది ఆంజనేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన గౌడ సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గౌడ కుల దేవతలు కాటమయ్య, సుమాంబ, వనం ఎల్లమ్మ, వనం మైసమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. జిల్లా నాయకుడు సత్యనారాయణగౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు పవన్‌గౌడ్, నాయకులు విద్యాసాగర్‌గౌడ్, జగన్‌గౌడ్, శ్రీహరిగౌడ్, రాజేందర్‌గౌడ్, రాజారాములుగౌడ్, విక్రంతేజగౌడ్, భరత్‌గౌడ్, రాజుగౌడ్, బాల్‌రాజ్ గౌడ్, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

అడ్డంకులు లేకుండా రిజర్వేషన్ అమలు చేయాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

పాలమూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : న్యాయపరమైన అడ్డంకులు లేకుండా బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని బీసీ, ఎస్సీ, మైనార్టీ నాయకుల రౌండ్ టేబుల్ సమావేశంలో డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎఫ్‌టీయూ కార్యాలయంలో స్కూల్ స్వీపర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.గట్టన్న అధ్యక్షతన బీసీ రిజర్వేషన్‌కు మద్దతుగా ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు మాట్లాడారు. రాజకీయ పార్టీల ప్రయోజనాలకు అనుకూలంగా ప్రవర్తించటం సిగ్గుచేటన్నారు. దేశంలో బీసీలకు విద్యా, ఉద్యోగ రాజకీయాల్లో అన్యాయం జరిగిందన్నారు. తరతరాలుగా మనువాదులు నిచ్చెన మెట్ల వ్యవస్థను ఏర్పాటు చేసి, కులపరమైన వివక్షతను పాటించారన్నారు. దేశవ్యాపితంగా కులగణన చేయటం కోసం పార్టీలు ఎందుకు జంకుతున్నాయని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ బీసీల సమస్య మాత్రమే కాదు ఇది మొత్తం సామాజిక సమస్య అన్నారు. సమావేశంలో సామాజిక వేత్త ఎండీ హనీఫ్‌అహ్మద్, టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.యం ఖలీల్, డాక్టర్ పి.యాదగిరి, బాలనాగన్న, సలీం, జాంగీర్, జలాల్‌పాషా, బాలరాజు, మీర్ మహబూబ్, రహీం పాల్గొన్నారు.

ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ



మహ్మద్‌హుస్సేన్‌పల్లిలో సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మూసాపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందిపేట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్, మహ్మద్‌హుస్సేన్‌పల్లి గ్రామంలో వనపర్తి జిల్లా సోషల్ మీడియా సమన్వయకర్త దేవన్న యాదవ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు సతీష్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ఓటు చోరీకి పాల్పడి కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. రాహుల్ గాంధీకి మద్దతుగా సంతకాలు సేకరించినట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ నిరంజన్, ఖలీల్, జైపాల్‌రెడ్డి, కురుమూర్తి, కిష్టారెడ్డి, ఉత్తన్న, శేఖర్, వెంకటన్న ఉన్నారు.

కాలనీకి రోడ్డు వదలండి



నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

మహబూబ్‌నగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 47వ వార్డు బోయపల్లిగేట్ ప్రాంతంలో నివాసం ఉంటున్న కాలనీకి రోడ్డును పునరుద్దరించాలని కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. సోమవారం కాలనీవాసులంతా ర్యాలీగా రోడ్డుపైకి వచ్చిన నిరసన తెలిపారు. తమ ప్రాంతానికి గతంలో ఉన్న 20 ఫీట్ల రోడ్డును ఓ మిల్లు వ్యాపారి గోడ కట్టుకుని ఆక్రమించుకున్నాడని వాపోయారు. ఇన్నాళ్ల రైల్వేట్రాక్ పక్కన ఉన్న రైల్వే స్థలం నుంచి రాకపోకలు సాగించేవాళ్లమని, ఇప్పుడు డబ్లింగ్ కావడంతో రైల్వేశాఖ ఆ స్థలాన్ని అంతా తీసేసుకోవడంతో తమ కాలనీకి దారిలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. తమకు 20 ఫీట్ల రహదారి ఉన్నట్లు నక్షలో ఉందని, తమకు ఇచ్చిన డాక్యుమెంట్‌లోనూ ఉన్నదని పేర్కొన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. దాదాపు అక్కడ 50 ఇళ్ల ప్రజలు నివాసం ఉంటున్నారని, తమ గోడును పట్టించుకోవాలని వేడుకుంటున్నారు

ఫిర్యాదుదారులను గౌరవించాలి : ఎస్పీ



ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పోలీస్‌స్టేషన్‌కు ఎంతో బాధతో బాధితులు వస్తుంటారని, వారిని మరింత బాధ పెట్టకుండా వారిపట్ల మర్యాదపూర్వగా గౌరవంగా నడుచుకోవాలని ఎస్పీ జానకి అన్నారు. బాధితులకు ధైర్యం ఇచ్చేలా మన ప్రవర్తన ఉండాలని సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ బాధితుల నుంచి 11 ఫిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఇది వరకు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు స్టేటస్ అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, అన్ని ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటిని పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా ప్రజావాణి ద్వారా అధికారులకు తెలియజేయడంతో సమస్య వేగంగా పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందన్నారు.

'ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం'

భూత్పూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం అని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక పాత్రికేయులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ప్రచారం చేయడానికి పార్టీ అధిష్ఠానం బాధ్యతలు అప్పగించిందని, ఈ ఎన్నికలకు తనతో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి మాజీ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, మర్రి జనార్ధన్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి పాల్గొంటున్నట్లు తెలిపారు. అంతకుముందు తెలంగాణ భవన్‌లో పార్టీ ఇన్‌చార్జిలతో ఎమ్మెల్సీ రవీందర్‌రావు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన సూచనల మేరకు బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలుపించుకుంటామని మాజీ ఎమ్మెల్యే ఆల ధీమా వ్యక్తం చేశారు. నెల రోజుల పాటు ఎన్నికల ప్రచారంలో చేపట్టాల్సిన విధివిధానాల గురించి ఎమ్మెల్సీ రవీందర్‌రావు సూచనలు, సలహాలు ఇచ్చినట్లు తెలిపారు.

కమిషనర్ హామీతో దీక్ష విరమణ



నగరపాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న కాలనీవాసులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా తమ కాలనీలో రోడ్డు సమస్యను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ నగరపాలక పరిధిలోని న్యూ మోతీనగర్ కాలనీవాసులు రైల్వే స్టేషన్ సమీపంలో దీక్షను నిర్వహిస్తున్నారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి మీ కాలనీలో రోడ్డు సమస్యతో పాటు ఇతర సమస్యలను పరిష్కరిస్తానని నచ్చజెప్పడంతో దీక్షను విరమించారు. అనంతరం కమిషనర్ నిమ్మరసం అందించారు. కార్యక్రమంలో కాశపోగు ప్రసాద్, నాగయ్య, పోలీస్ రాములు, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాల ఏర్పాటుతోనే రోగాల నిర్ధారణ

మిడ్జిల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఏర్పాటు చేసే వైద్య శిబిరాలతోనే రోగాలు నిర్ధారించుకునేందుకు వీలుంటుందని పల్లె దవాఖాన డాక్టర్ శశాంక్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని దోనూర్‌లో మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ శివకాంత్ ఆదేశాల మేరకు వైద్య శిబిరం ఏర్పాటు చేసి. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. 30 మందికి స్వాబ్ టమ్ శాంపిల్స్‌ను సేకరించారు. కొత్తపల్లి యూపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు పొగాకు వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. పొగాకు వాడకాన్ని మానుకోవాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ చెన్నమ్మ, కమ్యూనిటీ హెల్త్ అధికారి ఆయుబ్ ఖాన్, హెల్త్ అసిస్టెంట్ దేవయ్య, జీఎస్‌ఎం నరేష్, ఏఎన్‌ఎంలు శ్రీదేవి, పారిజాత, ఆశా వర్కర్లు శోభారాణి, లక్ష్మమ్మ, శిరీష, బాలమణి, లక్ష్మి స్వర్ణలత పాల్గొన్నారు.

ఆర్టీసీలో యూనియన్లను పునరుద్ధరించాలి

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రోడ్డు రవాణా సంస్థలో యూనియన్లను పునరుద్ధరించాలని మహబూబ్‌నగర్ ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ) రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌చారి విజ్ఞప్తి చేశారు. సోమవారం హైదరాబాద్ బస్ భవన్‌లో టీఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదరి అశ్వథామరెడ్డితో కలిసి వారు ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డిని కలిసి శాలువాతో సత్కరించారు. 2021, 2025కు సంబంధించిన పీఆర్సీ కూడా చెల్లించాల్సి ఉందని, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సిబ్బందితో నడిపించాలనే ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు భానుప్రకాష్ రెడ్డి, రాజేశ్వర్ రాజు, వసంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'చండీగఢ్ డీజీపీని అరెస్ట్ చేయాలి'

గండీడ్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రానికి చెందిన ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్యకు కారణమైన చండీగఢ్ డీజీపీ, ఇతర ఉన్నతాధికారులను సర్వీసు నుంచి రిమూవ్ చేసి, అరెస్ట్ చేయాలని ఉమ్మడి పాలమూరు జిల్లా అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు బోరు కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల వివక్షతో అవమానించడంతో మానసిక క్షోభకు గురై తన సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకుని పూరన్ కుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డారని పేర్కొన్నారు. అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు వెంకటయ్య, ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి వివేకానంద, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆశన్న, మల్కయ్య, నర్సింహులు, హన్మయ్య, చంద్రయ్య, అశోక్, నర్సయ్య, మల్లయ్య, బాలయ్య, ఈశ్వర్, అనిల్ పాల్గొన్నారు.

విలువలతో కూడిన జీవనం గడపాలి

జడ్చర్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : విలువలతో కూడిన జీవనం గడపాలని జడ్చర్ల ఎస్‌ఐ అక్షయ్‌దీప్ సూచించారు. ప్రజా భద్రత - పోలీసు బాధ్యత కార్యక్రమంపై సోమవారం జడ్చర్ల మండలంలోని చిట్టబోయిన్‌పల్లి బాలికల సాంఘిక, సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సైబర్ నేరాలు, మోసపూరిత మెసేజ్‌లు, లింకుల గురించి వివరించారు. మత్తు పదార్థాలు యువత భవిష్యత్తు నాశనం చేస్తాయని తెలిపారు. సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబరు 1930కు, మత్తు పదార్థాల తయారీ, సరఫరా, రవాణా, అమ్మకాల సమాచారాన్ని 8712659360 నెంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ అనిత, సురక్ష పోలీసు కళాబృందం, షీ టీమ్ బృందం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడిని ఖండించండి

పాలమూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని ఖండించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. న్యాయమూర్తి పైనే దాడిచేస్తే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటన్నారు. దాడికి ప్రయత్నించిన లాయర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీరాములు, బాలరాజు, కమాలాకర్, నరేందర్, జైపాల్‌రెడ్డి, రమేష్, యాదయ్య, కొండయ్య, కాన్షీరాం, భీరంరాజు, మహేష్, మిద్దె నాగరాజు, నాగరాజు, శ్రీనివాస్, రాధమ్మ, రామ రజిని, సుహాసిని, కీర్తి పాల్గొన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతు



ఎక్స్‌కవేటర్‌తో రోడ్డును చదును చేస్తున్న దృశ్యం

గండీడ్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పంచలింగాల్‌తండా నుంచి పగిడ్యాల్ గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డు కురిసిన వర్షాలకు కోతకు గురై గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అదే విధంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి రాకాసుల బండతండా వరకు గల మట్టి రోడ్డు కూడా గుంతలమయం కావడంతో స్పందించిన బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెంట్యా నాయక్ సొంత డబ్బులతో దాదాపు రెండు కిలో మీటర్ల మేర గుంతలు పడిన రోడ్డును బాగు చేయించారు. దీంతో తండా వాసులు పెంట్యానాయక్‌కు ధన్యవాదాలు తెలిపారు.